

సమస్యల పరిష్కారంలో జిల్లాకు రెండో స్థానం

కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరి ష్కారంలో రాష్ట్రస్థాయిలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. పీజీఆర్‌ఎస్‌తో పాటు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలతో జిల్లా అధికారులు వెంట వెంటనే స్పందించడంతోనే ఈ గుర్తింపు లభించింది. ఫ్రీహోల్డ్ పట్టాల వెరిఫికేషన్ ప్రక్రియను 99.49 శాతం పూర్తి చేసి ఇతర జిల్లాల కంటే ముందుంజ లో ఉంది. గత ఏడాది డిసెంబరు 6 నుంచి ఇప్పటి వరకూ 6138 వినతులు రాగా వీటిల్లో 5,726 వినతులకు పరిష్కారం చూపించి 93.28 శాతం సమస్యలు పరిష్కరించారు. రెవెన్యూ సదస్సుల ఫిర్యాదులను ఇదే స్థాయిలో పరిష్కరించారు.



నెల్లిమర్ల: ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాని జగనన్న లేఅవుట్

జగనన్న కాలనీల్లో అక్రమాలపై ఆరా

- సమగ్ర విచారణకు కలెక్టర్లకు ఆదేశం
- ఉత్తర్వులు జారీచేసిన భూ పరిపాలన కమిషనర్
- 15 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశాలు
- బినామీలుంటే పట్టాలు రద్దు
- అక్రమార్కుల్లో ఆందోళన

వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో అక్రమాలపై కూటమి ప్రభుత్వం లోతుగా ఆరా తీస్తోంది. ఆయా లే అవుట్లలో ఎంత మందికి పట్టాలిచ్చారు? అర్హులెవరు? అనర్హులెందరు? ఇళ్లు నిర్మించారా? లేదా? స్థలాలపై అమ్మకాలేమైనా జరిగాయా? స్థలాల్లో లబ్ధిదారులే ఉన్నారా? తదితర వివరాలను తేల్చాలని ప్రభుత్వం తాజాగా అధికారులను ఆదేశించింది. 15 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో అక్రమార్కుల్లో ఆందోళన నెలకొంది.

విజయనగరం/ కలెక్టరేట్/ నెల్లిమర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం జగనన్న కాలనీ లేఅవుట్లు ఏర్పాటుచేసి పేదలకు గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు స్థలంలో పట్టాలు ఇచ్చింది. తరువాత ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఏ లేఅవుట్లోనూ నిర్మాణాలు సరిగా జరగలేదు. ఇందులో భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా అనర్హులు పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు, ఇళ్లు సొంతం చేసుకున్నట్టు భావిస్తోంది. వారిని లెక్కించే పనిలో పడింది. అనర్హులను గుర్తించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. 15 రోజుల్లో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పర్యటించి వివరాలు సేకరించాలని ప్రభుత్వం సూచించింది. దీంతో అనర్హుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

జిల్లాలో 6040 లేఅవుట్లు ఏర్పాటుచేశారు. 81,999 ఇళ్ల పట్టాలతో పాటు అందరికీ ఇళ్లు మంజూరు చేశారు. ప్రధానంగా విజయనగరం, బొబ్బిలి, రాజాం, ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. విజయనగరం కార్పొరేషన్ లబ్ధిదారులకు సంబంధించి గుంకలాం లేఅవుట్‌లో 12,600 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించారు. అయితే దాదాపు అన్నిచోట్ల బినామీలకు పెద్దపీట వేశారన్న విమర్శలున్నాయి.

అటు లేఅవుట్ల ఏర్పాటులో కూడా భారీగా చేతివాటం ప్రదర్శించినట్టు ఆరోపణ లున్నాయి. ఊరికి దూరంగా, కొండ ప్రాంతాల్లో నివాసయోగ్యంకాని చోట భూములను కొనుగోలు చేసి లేఅవుట్లను ఎంపిక చేసినట్టు అప్పట్లో ప్రచారం నడిచింది. భూములను వైసీపీ నేతలు అధిక ధరకు కొనుగోలు చేసినట్టు కూడా అప్పట్లో బయటపడింది. ఇళ్ల పట్టాలు మంజూరు చేసినవాటిలో 40 శాతం బోగస్ అన్న ఆరోపణలున్నాయి. చాలా మంది అనర్హులు రాజకీయ సిఫార్సులతో పట్టాలు పొందినట్టు తెలుస్తోంది. ఇదివరకే ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టాలు పొందిన వారు సైతం ఈ లేఅవుట్లలో మళ్లీ పట్టాలు పొందినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి వారిని అధికారులు, సిబ్బంది గుర్తించనున్నారు. అనర్హులని తేలితే వీరి స్థానంలో అర్హులకు పట్టాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది.

ప్రత్యేక మొబైల్ యాప్..

అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. మొబైల్ యాప్‌లో వివరాలను (మిగతా 8వ పేజీలో..)



గంట్యాడ : నరవ గ్రామంలో లేఅవుట్‌పై వచ్చిన ఫిర్యాదుపై విచారిస్తున్న అధికారులు (ఫైల్)

సాఫ్ట్‌వేర్ ఇంజనీరు హత్య

- పెళ్లి సంబంధాల కోసం బెంగళూరు నుంచి ఊరికి రాక
- అమ్మమ్మ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా దారుణం
- తలను రాయిపై మోది చంపినట్లు వైద్యుల నిర్ధారణ
- కన్నీటి సంద్రంలో బాధిత కుటుంబం



ప్రసాద్ (ఫైల్)

చదువులో ముందు ఉండేవాడు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకూ అన్ని తరగతుల్లో ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ఆ తెలివి తేటలతోనే చిన్న వయసులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం సాధించాడు. ఇటు గ్రామంలో కూడా వివాదాలకు దూరంగా మసలేవాడు. స్నేహితులతోనే మాట్లాడేవాడు. పెళ్లి సంబంధాలు చూస్తామని అమ్మనాన్న చెప్పడంతో ఇటీవలే బెంగళూరు నుంచి ఇంటికి వచ్చాడు. సోమవారం సాయంత్రం అమ్మమ్మ ఊరు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి తిరిగి బయల్దేరాడు. కొడుకు కోసం ఎదురుచూస్తున్న తల్లికి గుండెను మెలేసే దుర్వార్త తెలిసింది. తనయుడు హత్యకు గురైనట్లు చెవిన పడిన వెంటనే ఆమె పరుగున వెళ్లింది. తీవ్రగాయాలతో అచేతనంగా పడి ఉన్న కొడుకును చూసి తట్టుకోలేకపోయింది. గుండెలవిసేలా విలపించింది. తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కోనారి ప్రసాద్(28) విషాదాంతమిది.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

తెర్లాం/ బొబ్బిలి/ బాడంగి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కోనారి ప్రసాద్(28) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈయనకు అమ్మనాన్నలు సన్యాసి, అప్పయ్యమ్మతో పాటు తమ్ముడు అచ్యుతరావు ఉన్నాడు. చెల్లెలు స్వాతికి వివాహమైంది. పెళ్లి సంబంధాలు చూసేందుకు అమ్మనాన్న పిలవడంతో ఇటీవలే ప్రసాద్ స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం సాయంత్రం అమ్మమ్మ ఊరు విజయరాంపురానికి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి తిరిగి బయల్దేరాడు. రాత్రి 9-30 గంటల సమయంలో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎన్.బూర్జివలస సమీపంలో ప్రసాద్ మృతదేహం రోడ్డుపై పడి ఉండడాన్ని చూసిన వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు పరుగుపరుగున ఘటనా స్థలికి వెళ్లారు. తీవ్ర గాయాలతో కదలిక లేకుండా ఉన్న ప్రసాద్‌ను చూసి గుండెలు బాదుకుని విలపించారు. అచేతన స్థితిలో యువకుని చూసి ఊరు ఊరంతా కన్నీరు పెట్టింది. చేతికి అందివచ్చిన కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తూ కుటుంబ సభ్యులకు కొండంత అండగా ఉన్నాడని ఆ తల్లిదండ్రులు (మిగతా 8వ పేజీలో..)

'ఒకరి ఊసు గాని మరొకరి జోలికి గాని ఎల్లనోడు నా కొడుకు. ఆడి పనేదో ఆడు చేసుకుంటుంటాడు. చిన్నప్పటి నుంచి ఆడికి చదువు తప్ప ఏ ధ్యాస లేదు. అలాంటి నా కొడుకును ఇంత కసాయిగా ఎవ్వరు చంపేసారు దేవుడా?' అని తల్లి అప్పయ్యమ్మ రోదిస్తుంటే అక్కడ ఉన్న వారంతా కకావికల మనస్కులై కన్నీరుపెట్టుకున్నారు.



నామినేషన్లన్నీ ఓకే

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ముగిసిన పరిశీలన
- రేపు మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప సంహరణకు అవకాశం
- మొత్తం ఓటర్లు 22,493 మంది
- పరిశీలకుడు ఎంఎం నాయక్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు అధికారుల ఆమోదం పొందాయి. విశాఖ కలెక్టరేట్‌లో మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థులందరి నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధర ప్రసాద్ ప్రకటించారు. ఎన్నికల పరిశీలకుడు ముదావత్ ఎం నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఈ స్థానానికి మొత్తం పది మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు సమర్పించగా, వాటిలో నాలుగు సెట్లు తిరస్కరించామని, మిగిలినవన్నీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో అన్నింటినీ ఆమోదిస్తున్నామని ప్రకటించారు. కాగా ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థులందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇదిలా ఉండగా తుది జాబితా మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో డీఆర్వో సీతారామారావు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.



నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

బాలుడ్ని మింగేసిన నీటికుంట

7 లో

తోటి పిల్లలతో సరదాగా ఆడుకుంటూ ఉన్న ఆ బాలుడు మిగతా వారితో పాటు గ్రామానికి సమీపంలో ఉన్న తోటపల్లి కాలువ వైపు బయలుదేరాడు. గట్టుపై ముందు నలుగురు నడుస్తుండగా వెనుక నడుస్తూ ఉన్నఫలంగా నీటి కంటలోకి జారిపోయాడు. వారు గమనించేసరికి ప్రాణాలే కోల్పోయాడు. ఈ ఘటనలో రాజాం మండలం పెనుబాక గ్రామనికి చెందిన చిన్నారి కుసుమంతరావు (8)మృతిచెందాడు.



కుసుమంతరావు (ఫైల్)

భవనం శిథిలం.. సౌకర్యాలు పూజ్యం

6 లో

వైభవంగా శ్రీరాముని రథయాత్ర

6 లో

కట్టుదిట్టంగా టెన్త్ పరీక్షలు

- పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- మార్చి 17 నుంచి 31 వరకూ నిర్వహణ
- హాజరుకానున్న 23,765 మంది విద్యార్థులు
- కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 17 నుంచి 31 వరకూ జరగన్ను పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. అలాగే ఓపెన్ స్కూల్ విద్యార్థులకు మార్చి 17 నుంచి 28 వరకూ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. టెన్త్ పరీక్షలపై మంగళవారం కలెక్టరు చాంబర్‌లో ఆయా శాఖల అధికారులుతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12.45 వరకూ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రెగ్యూలర్, ప్రైవేటు కలిసి జిల్లాలో 23,765 మంది 119 కేంద్రాల్లో రాయనున్నారని చెప్పారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి కేంద్రానికీ ఒక చీఫ్ సూపరింటెండెంట్ ను, డిపార్ట్మెంట్ అధికారిని నియమించాలని, ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రశ్న పత్రాలను భద్రపర్చేందుకు విజయనగరం, గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట పోలీస్ స్టేషన్లలో కస్టడీ ఏర్పాట్లు చేయాలన్నారు. తొమ్మిది రూట్‌లను ఏర్పాటు చేసి ఈవోపీఆర్‌డీ లేదా డిప్యూటీ తహసీల్దార్‌లను రూట్ ఆఫీసర్లుగా నియమించాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాస్ మూర్తి, డీఈవో మాణిక్యంనాయుడు, డీఎంహెచ్‌వో జీవనరాణి తదితరులు ఉన్నారు.

ఘంటసాలకు చిన్నారుల స్వర నీరాజనం

6 లో

అలనాటి పాటలతో ఆకట్టుకున్న బాలలు



దొంగలను పట్టేశారు

- బంగారం షాపు యజమాని ఇంట్లో చోరీని ఛేదించిన పోలీసులు
- 45 తులాల బంగారు ఆభరణాలు రికవరీ
- ముగ్గురు నిందితుల అరెస్టు
- పరారీలో సూత్రధారి

విజయనగరం క్రైమ్/ బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి బజారులో ఈ నెల 1న రాత్రి జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 45 తులాల బంగారు ఆభరణాలను రకవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను ఎస్పీ వకుల్‌జిందాల్ వెల్లడించారు.

బొబ్బిలి పట్టణంలో జ్యూయలరీ షాపు యజమాని గ్రంధి రవికుమార్ ఇంట్లో ఈనెల 1న రాత్రి చోరీ జరిగిన విషయం తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని బంగారు వడ్డాణం, గాజులు, గొలుసులు, బ్రాస్‌లెట్లు, ఇతర బంగారు వస్తువులు (45 తులాల విలువ రూ.10. 50 లక్షలు) చోరీకి పాల్పడినట్లు ఈ నెల 2న బొబ్బిలి పోలీసులకు రవికుమార్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన సీఐ కె.సతీష్‌కుమార్ నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆధారాలను బట్టి నిందితుల కదలికలను పరిశీలిస్తూ వచ్చారు. కాగా నిందితులుగా ఉన్న బొబ్బిలి మండలం గున్నతోటవలసకు చెందిన పెంకి శ్రీనివాసరావు (ఎ-2), పాత బొబ్బిలికి చెందిన బత్తుల సర్వేశ్వరరావు (ఎ-3), ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నరసింగరావు (ఎ-4)లు పేకాట, ఇతర చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో పాత నేరస్తుడు అయిన సీతానగరం మండలం జోగింపేట గ్రామానికి చెందిన పోలా భాస్కరరావు(ఎ-1)తో పరిచయం అయింది. దొంగతనాలు చేసేందుకు ఇల్లు చూపిస్తే చోరీ చేసిన సొత్తులో వాటా ఇచ్చేందుకు వీరి మధ్య ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే ఈ నెల ఒకటిన రాత్రి గ్రంధి రవికుమార్ ఇంట్లో చోరీ చేశారు. దొంగిలించిన బంగారు వస్తువుల్లో కొన్నింటిని కరిగించేశారు. మిగతా వాటిని అమ్మేందుకు నిందితులు శ్రీనివాసరావు, బత్తుల సర్వేశ్వరరావు, ముద్దాడ నర్సింగరావులు రాయగడ వెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ అక్కడకు వెళ్లి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఎక్కడున్నారో తెలుసుకుని వెళ్లి పట్టుకున్నారు. పరారీలో ఉన్న (ఎ-1) పోలా భాస్కరరావు గురించి గాలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

మంచు తెరలు... పగలే చీకట్లు

విజయనగరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత మూడు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. ఈ దృశ్యాలు ఒకవైపు ఆహ్లాదంగా కనిపిస్తుంటే.. మరోవైపు ఇబ్బందులూ సృష్టిస్తున్నాయి. దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు, ఇతర దృశ్యాలు కనిపించడం లేదు. పగలు కూడా వాహనదారులు లైట్ల వెలుతురులో... హారన్లు మోగిస్తూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఉదయం 9 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రాజపులోవ, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నాతవలసతో పాటు విజయనగరం, నెలివాడ, బొండపల్లి, రామభద్రాపురం తదితర ప్రాంతాల్లో మంచు దట్టంగా కమ్ముకుంటోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.


మంచు ముసుగులో రహదారి


జాతీయ రహదారిపై..


వెల్దూరు గ్రామం వద్ద ఇలా...


కోనాడ జంక్షన్‌లో మంచు తెరలు

ఘనంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు యాగశాలలో మంగళవారం సుందర కాండ హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. యాగశాలలో గత నెల 15వ తేదీ నుంచి సుందరకాండ హవనం నిర్వహిస్తున్నారు. పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని రామాయణంలోని పట్టాభిషేక సర్గ వినిపించి... అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు, అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు, అర్చకులు కిరణ్‌కుమార్, పాణంగిపల్లి ప్రసాదరావు, పవన్‌కుమార్, రామ్‌గోపాల్, జనసేన నాయకుడు డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ పాల్గొన్నారు.


పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ సిబ్బంది

ఘంటసాలకు చిన్నారుల స్వర నీరాజనం

- అలనాటి పాటలతో ఆకట్టుకున్న వైనం

విజయనగరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వారంతా ఆరేళ్ల నుంచి పదేళ్ల వయసు గల చిన్నారులు. అందులో కొందరికి కొన్ని పదాలు పలకడమే సరిగా రాదు. కానీ.. వారి గొంతు నుంచి జాలువారిన పాటలు శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. కరతాళ ధ్వనులతో ప్రేక్షకులు ప్రశంసించేలా చేశాయి. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపేట మండపం వద్ద స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. సంగీత దర్శకుడు ఎం.భీష్మారావు ఆధ్వర్యంలో చిన్నారులు పాడిన పాటలు అలరించాయి. ఘంటసాల ఆలపించిన చిత్రాల్లోని గీతాలను అలవోకగా పాడి... సంగీత ప్రియుల హృదయాలను దోచుకున్నారు. 'నన్ను దోచుకుందువటే.., చామంతీ ఏమిటే ఈ వింత.., నెలవంక తొంగిచూసింది.., తదితర ఘంటసాల గీతాలను వీనుల విందుగా ఆలపించారు. సంగీత వాయిద్యాలతో చిన్నారులు చేసిన విన్యాసాలు ప్రశంసలు అందుకున్నాయి. అంతకుముందు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులు అర్పించారు. కళాపీఠం ప్రతినిధులు ధవళ సర్వేశ్వరరావు, గ్రంధి విష్ణుమూర్తి, వైవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




ఘంటసాల గీతాలను ఆలపిస్తున్న చిన్నారులు


పాటలు పాడుతున్న విద్యార్థులు

మూడో వారమూ.. జన ప్రవాహమే

- శంబరకు పోటెత్తిన భక్తులు


అమ్మవారి దర్శనానికి ఎండలో భక్తుల బారులు


చదురుగుడి వద్ద క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

సాలూరు (మక్కువ), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడో వారం జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. తొలి, మారువారం జాతరలకు మించి భక్తులు మూడో వారం జాతరకు చేరుకోవడంతో చదురుగుడి, వనంగుడి వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు నిండిపోయాయి. దీనితో భక్తులు గోముఖి నది వంతెన వరకు ఎండలోనే అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. చదురుగుడిలో పోలమాంబను దర్శించుకునేందుకు భక్తులు ఓపికతో వేచి చూశారు. వేపచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గోముఖి నదీ తీరాన అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. కోళ్లు, చీరలు, మొక్కులు చెల్లించుకున్నారు. వనంగుడి సమీప ప్రాంతాల్లో చెట్ల కింద వంటా వార్పూ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ ఏర్పాట్లు చేశారు. సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

సిరిమాను చెట్టుకు పూజలు

సాలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్యామలాంబ అమ్మవారి పండుగలో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆర్సీఎం స్కూల్ లోపల ఉన్న చెట్టును సిరిమానుగా అమ్మవారు చూపించడంతో జిన్ని, అల్లు కుటుంబీకులు ఉపవాసం చెల్లించారు. అనంతరం సిరిమాను చెట్టుకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చెట్టుకు పూలదండలు, పసుపు, కుంకుమలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావుతో పాటు జన్నివారు, అల్లువారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో భక్తులు

వైభవంగా శ్రీరాముని రథయాత్ర

- అధిక సంఖ్యలో హాజరైన భక్తజనం


రథయాత్ర దృశ్యం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద మంగళవారం రాత్రి నవ వధూవరులు సీతారాములను ఊరేగించే రథయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. ఏటా రామస్వామి వారి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాములకు తిరుకళ్యాణ మహోత్సవం నిర్వహించడం... నాలుగో రోజున సీతారాములను రథంపై ఊరేగించడం ఆనవాయితీ. ఈ రథాన్ని సీతారామునిపేట గ్రామస్థులు, యువకులు లాగుతుంటారు. తొలుత రథంపై సీతారాములకు ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు, అర్చకులు కిరణ్ కుమార్, పాణంగిపల్లి ప్రసాదరావు పవన్ కుమార్, రామ్‌గోపాల్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మెయిన్ రోడ్డు మీదుగా కుమ్మరి ఖానా వరకు లాగి... ఆ తర్వాత ఆలయం వరకు తీసుకువెళ్లారు. రథయాత్రను తిలకించేందుకు నెల్లిమర్ల, విజయనగరం, పూసపాటిరేగ, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు, రామాలయం అర్చకులతో పాటు ఉమాసదాశివ స్వామి ఆలయ అర్చకులు రేజేటి మల్లికార్జున శర్మ తదితరులు పాల్గొన్నారు. భోగాపురం సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

భవనం శిథిలం.. సౌకర్యాలు పూజ్యం

- ఇదీ పాగిరిలోని లెప్రసీ ఆస్పత్రి తీరు
- డెన్మార్క్ సాయంతో 60 ఏళ్ల కిందట నిర్మాణం
- వేలాది మందికి పునర్జన్మ ఇచ్చిన వైద్యశాల
- ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన వైనం


రాజాంలోని లెప్రసీ ఆస్పత్రి ప్రాంగణంలోని వైద్యాధికారి జీపు ఇది. మూలకు చేరడంతో ఇలా అక్కడే వదిలేశారు. కనీసం స్క్రాప్‌గా ఉపయోగించేందుకు కూడా పనికిరాని స్థితికి చేరుకుంది. దీంతో అత్యవసర వైద్యసేవలు, ఆస్పత్రి నిర్వహణకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి.

రాజాం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి)

సుమారు ఆరు దశాబ్దాలుగా సేవలందిస్తున్న వైద్యశాల అది. వేలాది మందికి పునర్జన్మ ఇచ్చిన ఆస్పత్రి అది. కానీ ప్రస్తుతం దయనీయ స్థితికి చేరుకుంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అయినా సరే ప్రభుత్వాలపరంగా ఎటువంటి చర్యలు లేవు. దీంతో దాతల సహకారంతో ఆస్పత్రిని నిర్వహించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. ఇదీ రాజాం పట్టణానికి కూతవేటు దూరంలో పొగిరి పంచాయతీ పరిధిలోని లెప్రసీ (కుష్ఠు వ్యాధి నివారణ) ఆస్పత్రి వ్యథ. దీనికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 1962లో డెన్మార్క్ సహకారంతో ఇక్కడ లెప్రసీ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఏటా వందలాది మంది ఇక్కడ వైద్యసేవలు అందుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా బయటకు వెళ్లేవారు. అప్పట్లో కుష్ఠు వ్యాధి అంటే అంటరాని వ్యాధిగా చూసేవారు. అటువంటి సమయంలో ఇక్కడ లెప్రసీ ఆస్పత్రి నిర్వహణకు డెన్మార్క్ సహకారం అందించింది. ప్రారంభంలో ప్రభుత్వాలు బాగానే సహకరించడంతో ఆస్పత్రి నిర్వహణ సరిగా ఉండేది. కానీ కాలక్రమంలో గాలికొదిలేశారు. గత ఐదేళ్ల వైసీపీ హయాంలో కనీసం రూపాయి కూడా కేటాయించలేదు. దీంతో జీఎంఆర్ ఫౌండేషన్ సహకారంతో రోగులకు భోజనాలు, వసతి కల్పిస్తున్నారు. వంట మనుషులు, సహాయకులు, అటెండర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

శిథిలావస్థలో...

సుమారు 11 గదులతో ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. 20 పడకల ఆస్పత్రిగా అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడు అందులో ఎనిమిది గదులు పూర్తిగా దెబ్బ తిన్నాయి. మూడు గదులే అందుబాటులో ఉన్నాయి. 20 పడకలకు గాను ప్రస్తుతం ఆస్పత్రిలో నలుగురు రోగులు ఉన్నారు. రోజుకు 10 మంది వరకూ రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. ఆస్పత్రిని నిర్మించి 60 సంవత్సరాలు కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గదులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. భవనం పైకప్పు పూర్తిగా దెబ్బతింది. కిటికీలు, ద్వారాలు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో చలికాలం సిబ్బందితో పాటు రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ వైద్యుడు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఎఫ్ఎన్ఓ ఉన్నారు. ఫిజియోథెరపిస్టుతో పాటు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ఆస్పత్రికి కేటాయించిన వాహనం ఎప్పుడో మూలకు చేరింది. ఇప్పటికైనా ఈ ఆస్పత్రికి పూర్తి స్థాయిలో భవన సదుపాయం..మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


మంచాలు ఇలా..


శిథిలావస్థలో ఉన్న భవనం

ఉన్నతాధికారులకు నివేదించాం..

ఆస్పత్రి భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వైద్యసేవలపరంగా ఎటువంటి ఇబ్బందులు లేవు. కానీ గదులు బాగా లేకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నాం. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఫిజియోథెరపిస్టులతో పాటు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

-డాక్టర్ కృష్ణమోహన్, వైద్యాధికారి, లెప్రసీ ఆస్పత్రి

హమ్మయ్యా..

● శ్రీనివాస రోడ్డులో తొలగిన ఆక్రమణలు

● ఊపిరి పీల్చుకుంటున్న జనం

రాజాం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అమ్మో.. శ్రీనివాస రోడ్డా.. అటు వైపు వెళ్లడం కన్నా మరోదారి చూసుకోవడమే బెటర్ అనేది గతంలో మాట. శ్రీనివాస రోడ్డులో వెళ్దామనేది ఇప్పుడు అందరి నోటా వినిపిస్తోంది. పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి బజారు రోడ్ జంక్షన్ వరకూ ఇరువైపులా కాల్వలపై నాలుగు చక్రాల బండ్లతో పాటు తాత్కాలిక, శాశ్వత అక్రమ నిర్మాణాలు ఉండేవి. వాటికి తోడు రోడ్డుపైనే ఆటోలు, లగేజీ వ్యాన్‌లు నిలిపేవారు. వాహనాల పార్కింగ్, మార్కెట్‌లోకి వెళ్లి వచ్చే భారీ వాహనాలతో నిత్యం ట్రాఫిక్ జామ్ అయ్యేది. దశాబ్ద కాలంగా ఇదే పరిస్థితి ఉండేది. ఈ రోడ్డులో ప్రజల ఇబ్బందులపై ఎవరూ దృష్టి సారించలేదు. అయితే రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఈ రోడ్డుపై దృష్టి పెట్టారు. ట్రాఫిక్ జామ్ సమస్యకు పరిష్కారం చూపాలని నిర్ణయించారు. దాంతో అక్కడి వ్యాపారులతో పాటు ఆక్రమణదారులతో మాట్లాడారు. మున్సిపల్ అధికారుల సహకారంతో రోడుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించే ఏర్పాటు చేశారు. వ్యాపారాలు కోల్పోయిన వారికి పాత బస్టాండ్ ఏరియాలో స్థలాలను కేటాయింపునకు చర్యలు చేపట్టారు. ఓవైపు ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. ఇష్టారాజ్యంగా ఆటోలు నిలపకుండా, ఆక్రమణల నిరోధానికి వీలుగా రెండు షిఫ్టుల్లో హోం గార్డులను నియమించారు. రద్దీ సమయాల్లో సైతం పోలీసులు అదే రోడ్డులో రాకపోకలకు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా నడకకు ఇబ్బంది పడే శ్రీనివాస రోడ్ ఇప్పుడు సుమారు 40 అడుగుల మేర విశాలంగా మారింది. జటిల సమస్యను పరిష్కరించిన సీఐ అశోక్‌కుమార్ చర్యలను అందరూ అభినందిస్తున్నారు.



ఆక్రమణలు తొలగించక ముందు..



తొలగించిన తరువాత..

జేఈఈ మెయిన్స్‌లో 1582వ ర్యాంకు



ఆశిష్

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ మొదటి సెషన్‌లో జిల్లాలోని మెరకముడిదాం మండలం బూసాయివలస గ్రామానికి చెందిన కందుకూరి ఆశిష్ ఆల్ ఇండియాలో 1582 ర్యాంకు సాధించారు. మంగళవారం జేఈఈ మెయిన్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆశిష్ తండ్రి రవికుమార్ హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆశిష్ ఫిజిక్స్‌లో 96.58 పర్సంటైల్, కెమిస్ట్రీ 95.86, గణితంలో 93.60 మొత్తం 96.88 పర్సంటైల్ సాధించారు.

రాజాం విద్యార్థికి 99.60 పర్సంటైల్



పవన్‌తేజ

రాజాం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటి పరిధిలోని డోలపేటకు చెందిన పాలవలస పవన్‌తేజ జేఈఈ మెయిన్స్‌లో 99.60 పర్సంటైల్ సాధించాడు. మంగళవారం జేఈఈ మెయిన్స్ ఫలితాలు వెల్లడయ్యాయి. పవన్ తేజ తండ్రి భాస్కరరావు రైల్వే ఉద్యోగి.

క్రికెట్ టోర్నీ విజేత కల్లేపల్లి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో సదానందేశ్వర, విజయకేశవస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కల్లేపల్లి నిలిచింది. పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరిచిన్నయ్యపాలెం జట్టుతో కల్లేపల్లి జట్టు తలపడి విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన కల్లేపల్లి జట్టు 8 ఓవర్లలో 74 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కరిచిన్నయ్యపాలెం జట్టు 50 పరుగులకు ఆల్ అవుట్ అయింది. విజేతలకు గురువారం సాయంత్రం నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రూ 97,500కు వేలం పాట ఖరారు

వంగర, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా సంగాంలో నిర్వహించనున్న జాతరలో ప్రసాదాల విక్రయానికి మంగళవారం వేలంపాటను నిర్వహించినట్టు ఈవో శ్యామలరావు తెలిపారు. అదే గ్రామానికి చెందిన బడ్రోతు పరమేశు నాయుడు రూ.97,500లకు పాట దక్కించుకున్నారని తెలిపారు. ఆలయంలో 9 రోజుల పాటు నిర్వహించనున్న జాతరలో 80 గ్రాముల లడ్డూ ప్రసాదం రూ.15, 150 గ్రాముల పులిహోర రూ.10లకు అమ్మకాలు జరిపాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఆనందరావు, కేశవరావు ఉన్నారు.

9న ఉత్తరాంధ్ర ఏకపాత్రాభినయ పోటీలు

రాజాం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 99వ జాతరమహోత్సవం సందర్భంగా సలాది వెంకటరమణ కళాపరిషత్ ఆధ్వర్యంలో మార్చి 9న మహిళా కళాకారులతో ఉత్తరాంధ్ర స్థాయి పౌరాణిక సాంఘిక, జానపద ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నామని కళాపరిషత్ అధ్యక్షుడు సలాది ఉలసీదాస్, ప్రధాన కార్యదర్శి ఆర్నిపల్లి వెంకటనాయుడు ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.6 వేలు. ద్వితీయ బహుమతి రూ. 5 వేలు. తృతీయ బహుమతి రూ.4వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 15 నుంచి 20లోగా కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి ఆర్నిపల్లి వెంకటనాయుడు, అమ్మవారి కాలనీ, మొదటి లైన్, రాజాంను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441756874. 9491569723 లకు సంప్రదించాలన్నారు.

రేగిడి ఎస్ఐకి ప్రశంసాపత్రం

రేగిడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన రేగిడి ఎస్ఐ నీలావతికి ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం ప్రశంసాపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన చోరీల్లో నిందితులను పట్టుకోవటం, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపడం తదితర వాటిని గుర్తించిన ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

మార్చిలోగా పనులు పూర్తిచేయండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) ఆర్థిక సాయంతో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్) కింద చేపడుతున్న పనులు మార్చిలోగా పూర్తిచేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నాబార్డు నిధులతో చేపట్టే పనులపై ఆయన సమీక్షించారు. జిల్లాలోని పది ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.926.60 కోట్ల అంచనా వ్యయంతో 203 ప్రాజెక్టులను చేపట్టగా, వాటికి ఆర్ఐడీఎఫ్ నుంచి రూ.636.35 కోట్లను కేటాయించామని నాబార్డు ఏజీఎం నాగార్జున తెలిపారు. ఇందులో రూ.423.06 కోట్లు ఆయా ప్రభుత్వ శాఖల ఖర్చు చేశాయని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో రెండు ఫిషింగ్ జెట్టీల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి, విద్య-సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారి డీవీ మూర్తిని ఆదేశించారు. బీసీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించలేదని సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ఈఈ వివరించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ కవిత, సమగ్ర శిక్ష అధికారులు ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు



కిట్లు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం టెన్త్ విద్యార్థులకు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు, వాసవీ సంఘం ప్రతినిధులు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పచ్చిపులుసు ఈశ్వరరావు, హనుమాలశెట్టి నానాజీ, బాలనాగు శ్రీనివాస్, కుసుమంచి వెంకటరావు, సురేష్‌కుమార్ అప్పారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు పుణ్యగిరిలో కల్యాణోత్సవం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన పుణ్యగిరిలోని ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని ఘనంగాద నిర్వహించనున్నామని ఈవో నాగేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం పుణ్యగిరి కొండపై స్వామివారికి కల్యాణోత్సవంతో పాటు లక్ష బిల్వార్చన చేస్తామన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమరాధన చేపడతామన్నారు.

పాడి రైతులకు రూ.11.15 కోట్ల పరిహారం



మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ జేడీ

లక్కవరపుకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఐదేళ్లలో పశువులను కోల్పోయిన పాడి రైతులకు కూటమి ప్రభుత్వం రూ.11 కోట్ల 15 లక్షల నష్టపరిహారం చెల్లించిందని పశు సంవర్థక శాఖ జేడీ వై.వి.రమణ తెలిపారు. మంగళవారం ఎల్.కోట పశువైద్యశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పశు బీమా కింద పశువులు చనిపోయిన రైతులకు ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. జిల్లాలో 3725 మంది రైతులు పశువులను కోల్పోయారని తెలిపారు. వారందరికీ ప్రస్తుత ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించిందన్నారు. అలాగే పశు గ్రాసం, గడ్డి యంత్రాలు రాయితీపై ప్రభుత్వం అందిస్తోందని రైతులు వినియోగించుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎల్.కోట పశు వైద్యురాలు కె.గాయత్రి ఉన్నారు.

● కొత్తవలస: పశుగణనను ఈ నెలాఖరికి పూర్తి చేయాలని జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కొత్తవలసలలోని పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఏడీ గంగాధర్‌తో ఆయన మాట్లాడారు.వేసవిలో పాడి రైతులకు పశు సంరక్షణలోజాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

రాయితీపై ఫ్రూట్ కవర్స్

లక్కవరపుకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు 50 శాతం రాయితీపై ఫ్రూట్ కవర్స్ ప్రభుత్వం అందిస్తోందని ఉద్యానశాఖాధికారి పి.పద్మ తెలిపారు. మంగళవారం గనివాడలో మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. మండలంలో సుమారు 2900 హెక్టార్లలో మామిడి సాగవుతోందన్నారు. మంచు ప్రభావంతో పంటకు నష్టం కలుగుతోందన్నారు. పురుగు నివారణకు సస్యరక్షణ చేపట్టాలన్నారు. ఫ్రూట్ కవర్లతో పురుగు నివారణతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.స్వాతి ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతులను గుర్తించండి

రాజాం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించాలని న్యాయసేవాధికార సంస్థ మండల అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ పిలుపునిచ్చారు. కోర్టు సముదాయ ప్రాంగణంలో మంగళవారం ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈనెల 24న నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ వీవీబీ సుబ్రహ్మణ్యం సారథ్యంలో సర్వే జరుగుతుందని వివరించారు. సమావేశంలో జూనియర్ న్యాయాధికారి కృష్ణసాయితేజ ఉన్నారు.

గురుకులంలో సీట్లు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): ఉంగరాడలోని అంబేడ్కర్ గురుకులంలో ఖాళీగా ఉన్న ఐదోతరగతి, ఇంటర్ సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం కాలేజీని సంప్రదించాలని సూచించారు.

కేంద్ర మంత్రికి గురజాడ చిత్రపటం

● ఢిల్లీలో అందజేసిన ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రముఖ కవి గురజాడ అప్పారావు చిత్రపటాన్ని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అందజేశారు. ఇటీవలి కేంద్రబడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ఏపీకి న్యాయం చేసినందుకు కృతజ్ఞతగా మంగళవారం పార్లమెంటు భవనంలో కేంద్ర మంత్రికి చిత్రపటాన్ని అందజేసినట్లు ఎంపీ కలిశెట్టి తెలిపారు. కాగా, ఇటీవల పార్లమెంట్‌లో కేంద్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టే ముందు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్.. గురజాడ అప్పరావు కవితా పంక్తులు 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్..' అని పేర్కొన్న సంగతి తెలిసిందే.

హత్యకు గురైన తహసీల్దార్ భార్యకు ఉద్యోగం

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ ఎస్.రమణయ్య దారుణ హత్యకు గురై ఏడాది పూర్తయిన తరువాత ఆయన భార్య పోలాకి అనూషకు కారుణ్య నియామకం కోటాలో గ్రూపు-2 ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌గా నేరుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రమణయ్య విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయినప్పటికీ కొమ్మాదిలోనే కుటుంబంతో నివసించేవారు. ఇక్కడ పనిచేసినపుడు ఓ భూ వివాదానికి సంబంధించి సానుకూలంగా వ్యవహరిస్తామని చెప్పి, ఓ వ్యక్తికి హామీ ఇచ్చి ఆ పని చేయలేకపోయారు. దాంతో సదరు వ్యక్తి కక్ష గట్టి గత ఏడాది ఫిబ్రవరి 2న కొమ్మాదిలో రమణయ్య అపార్ట్‌మెంట్‌కి వెళ్లి, సెల్లార్‌లో కాసేపు ఆయనతో మాట్లాడి, ఆ తరువాత ఇనుప రాడ్‌తో తలపై కొట్టి పారిపోయాడు. కింద పడిపోయిన రమణయ్యను వాచ్‌మెన్ గమనించి, కుటుంబ సభ్యులకు చెప్పడంతో తక్షణమే ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన 24 గంటల్లోనే మరణించారు. తల్లిదండ్రులు, ఇద్దరు చిన్న పిల్లలు ఉండటంతో ఆ కుటుంబానికి సాయం చేయాలని రెవెన్యూ అసోసియేషన్ లేఖ రాయగా, బీఎస్సీ పాసైన భార్య అనూష పేరును విజయనగరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు అన్నింటిని పరిశీలించిన ప్రభుత్వం ఆమెను జోన్-1లో డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

సామాజిక భవనం మంజూరు చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చీపురుపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెట్టపల్లిలోని ఎస్సీ కాలనీలో సామాజిక భవనం మంజూరు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్పంచ్ ప్రతినిధి బూటు శ్రీను నేతృత్వంలో కాలనీవాసులు కలిసి మాట్లాడారు. కాలనీలో ఐదు సెంట్ల స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఆ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చండి

మెంటాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాకోటి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం ఆండ్రలో గిరిజనులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం జీవో నెంబరు 3ను అమలు చేయాలన్నారు. ఆండ్ర ప్రాజెక్టు గిరిజన నిర్వాసితులకు చేపల సొసైటీ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామరాపల్లి సోములు ఉన్నారు.

ఘనంగా ముగిసిన పరదేశమ్మతల్లి తీర్థం



బహుమతులు అందజేస్తున్న పెద్దలు

వేపాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చినగుడి పాలెం‌లో పరదేశమ్మతల్లి అమ్మ వారి తీర్థ మహోత్సవం మంగళ వారం ఘనంగా ముగిసింది. ఉత్సవాల్లో రెండోరోజు అమ్మవారికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించు కున్నారు. మధ్యాహ్నం ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో సుమారు 16 ఎడ్ల బండ్లు పాల్గొనగా దేవరాపల్లికి చెందిన జైవీరాం జనేయ బండి ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వీవీసీహెచ్ రామునాయుడు, సర్పంచ్ భోజంకి రాము నాయుడు, లండ దేముడు, వేచలపు రామకృష్ణ సారథ్యంలో వేడుకలు జరిగాయి.

దీన్‌దయాళ్‌కు నివాళి

గజపతినగరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంతకర్త కర్మయోగి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు మరువలేనివని నియోజకవర్గ కన్వీనర్ సరిది దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని గజపతినగరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేటికోటి భాస్కరరావు, జిల్లా కార్యదర్శి మండపాక భారతి, ఏడుకొండలు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే జామి మండలకేంద్రంలోనూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు.

అడ్డగోలుగా క్వారీ పేలుళ్లు

● మాధవరాయమెట్టలో ఇళ్లు పరిశీలించిన సీపీఎం నాయకులు

జామి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు క్వారీలు అడ్డగోలుగా నిర్వహిస్తున్నారు. దాంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడటమే కాకుండా ఆ సమీపంలోని జనావాసాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈనేపథ్యంలో మంగళవారం మాధవరాయమెట్ట పరిసరాల్లో క్వారీ పేలుళ్ల వల్ల ఇళ్లకు జరిగిన నష్టాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ నాయకుడు కె.సురేష్, గాడి అప్పారావు తదితరులు మాట్లాడారు. క్వారీ పేలుళ్ల వల్ల ఇళ్లు బీటలు వారడమే కాకుండా, పెద్దఎత్తున దుమ్ము, ధూళి వల్ల స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జామి పక్క మండలమైన ఎస్.కోటలోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. వీటిపై కలెక్టర్, ఎస్పీలు విచారణ చేయించి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

బాలుడిని మింగేసిన నీటికుంట

క్రైం న్యూస్

రాజాం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నాన్నా.. లేరా.. లేచి రారా.. మరి రావా.. నన్ను ఒదిలి వెళ్లిపోయావా అంటూ ఓ చిన్నారిపై పడి ఓ మహిళ చేసిన ఆర్తనాదాలు రాజాం సామాజిక ఆసుపత్రిలో చూపరులను కంటతడి పెట్టించాయి. అప్పటివరకూ ఇంట్లోనే ఉన్నాడు. తోటి చిన్నారులంతా ఆటకు వెళ్తే వారివెంటే వెళ్లాడు.. నలుగు రైదుగురు ముందు నడుస్తుంటే.. ఆ చిన్నారి నాలుగడుగుల దూరంలో వారిని అను సరిస్తూ నడుస్తున్నాడు. వెళ్తూ వెళ్తూ మార్గమధ్యంలో ఉన్న నీటికుంటలో ఉన్న ఫళంగా పడిపోయాడు. ఇదేమీ గమనించని ఆ చిన్నారులంతా చెరువుగట్టు వద్దకు వెళ్లారు. కాసేపటి తరువాత తిరిగి వస్తూ మార్గమధ్యంలో నీటికుంటలో పడిఉన్న తన స్నేహితుడిని చూసి గ్రామంలోకి వెళ్లి జరిగిందంతా చెప్పారు. కుటుంబ సభ్యుల తో పాటు గ్రామస్థులు వెళ్లేసరికి శవమై తేలాడు. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని పెనుబాక గ్రామ సమీపం తోటపల్లి కాలువ ప్రాంతంలో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భవాని, లక్ష్మణల కుమారుడు కుసుమంతరావు (8) రాజాంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం స్కూల్‌కు వెళ్లకుండా ఇంటివద్దనే గడిపాడు. సాయంత్రం తోటి స్నేహితులతో తోటపల్లి కాలువ సమీపంలో ఆటకు వెళ్లాడు. అందరితో కలిసి వెళ్లకుండా కాస్త వెనుక నడుస్తూ కాలుజారి నేలకుంటలో పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంట్లోకి దూసుకొచ్చిన బైక్

● వ్యక్తిని ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి



మాధవరావు (ఫైల్)

రాజాం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చావు ఏ రూపంలో వస్తుందో.. ఎలా వస్తుందో ఎవ్వరికీ తెలియ దనేందుకు మండల పరిధిలోని ఒమ్మి పంచాయతీ కొత్తపేటలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. అప్పటివరకూ ఇంటి గడపలో భార్యా భర్తలిద్దరూ కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నారు. ఇంతలో మంచినీరు తెస్తానని చెప్పి భార్య వీధిలోకి వెళ్లింది. భర్త ఒక్కరే స్టూల్‌పై కూర్చుని ఉన్నారు. హఠాత్తుగా ఓ బైక్ ఇంట్లోకి దూసుకొచ్చి స్టూల్‌పై ఉన్న అతడిని బలంగా ఢీకొంది. ఏమైందో తెలుసుకునే లోపు పెద్దపెద్ద కేకలు పెడుతూ నేలకూలాడు ఆ వ్యక్తి. బైక్‌తో ఢీకొన్న వ్యక్తి సైతం తీవ్ర గాయాలపాలై గడపలో పడిపోయాడు. అప్పుడే మంచినీటి కోసం బయటకు వెళ్లిన భార్య ఇంటివద్ద జనం గుమిగూడి ఉండడం చూసింది. విషయం తెలుసుకుని గుండెలు బాదుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో భార్యాభర్తలు సీత, మాధవరావు కష్టసుఖాలు మాట్లాడుకుంటున్నారు. మంచినీరు తెచ్చేందుకు సీత వీధిలోకి వెళ్లడంతో ఒక్కడే కూర్చుని మాధరరావు ఏదో ఆలోచిస్తున్నాడు. ఇంతలో రాజాం వైపు నుంచి బొబ్బిలి వైపు ద్విచక్ర వాహనంపై మితిమీరిన వేగంతో వెళ్తున్న వ్యక్తి నేరుగా మాధవరావు ఇంటి గడపలోకి బైక్‌తో దూసుకొచ్చి ఆయనను ఢీకొన్నాడు. దాంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌తో ఢీ కొన్న వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. గాయపడిన వ్యక్తిది శ్రీకాకుళం. కాగా రెవెన్యూశాఖలో సర్వేయర్‌గా మాధవరావు విధులు నిర్వహి స్తున్నాడు. భార్య సీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

కొత్తవలస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో సోమవారం రాత్రి రైలు ఢీ కొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందారు. కొత్తవలస కుమ్మర వీధికి చెందిన బొబ్బరి అప్పలరాజు (43) కొత్తవలస జంక్షన్‌లోని అండర్ బ్రిడ్జి సమీపంలో రైల్వే లైన్ దాటుతుండగా విజయనగరం నుంచి కొత్తవలస వైపు వస్తున్న గూడ్స్ రైలును అతడిని ఢీకొంది. దాంతో అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే అండర్ బ్రిడ్జికి సంబంధించి పైకప్పు పనులను రైల్వే అధికారులు చేయిస్తున్నారు. ప్రత్యామ్నాయ రహదారుల్లో రాకపోకలు సాగించాలని అధికారులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే దాన్ని పట్టించుకోకుండా రైల్వే లైన్ మీదుగా అప్పలరాజు వెళ్లడంతో ప్రమాదం జరిగింది రైల్వే పోలీసులు శవ పంచనామా ముగించి పోస్టుమార్టానికి మృతదేహాన్ని తరలించారు.

ట్రాక్టర్ తొట్టె పడి డ్రైవర్..

సాలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టేకు కర్రలతో ఉన్న ట్రాక్టర్ తొట్టె పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన అంటివలస గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా తెర్లాం మండలం సంగిరెడ్డివలస గ్రామానికి చెందిన మడక తిరుపతిరావు(49) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాలూరు మండలంలోని ఖరాసువలస గ్రామంలోగల టేకు దుంగలను ట్రాక్టర్‌పై ఎక్కించుకుని అంటివలస మీదుగా అమిటీ గ్రామానికి తరలిస్తున్నారు. అయితే అంటివలస గ్రామ సమీపంలో రహదారి ఎత్తు పల్లాలుగా ఉండటంతో టేకు కర్రలతో ఉన్న ట్రాక్టర్ తొట్టె. వెనుక నుంచి బలంగా తిరుపతిరావును ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ట్రాక్టర్ బోల్తా పడింది. మృతుడికి భార్య దుర్గమ్మ, కొడుకు జనార్దన్, కుమార్తె దేవి ఉన్నారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు.

కారును ఈడ్చుకెళ్లిన లారీ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం రైల్వేగేటు వద్ద మంగళవారం ఉదయం లారీ. ఓ కారును ఈడ్చుకెళ్లింది. రైల్వే గేటు తీసే సమయంలో విజయనగరం నుంచి సాలూరు వైపు వెళుతున్న లారీ పక్కనే ఉన్న కారును రైల్వేగేటు అవతల వైపు వరకు ఈడ్చుకెళ్లింది. వాహనదారులు కేకలు వేయడంతో లారీని నిలిపివేశారు. కారులోని వారు క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

గంట్యాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండతామారాపల్లి సమీపంలో విశాఖ నుంచి రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఫ్లైఓవర్ వద్ద ముగ్గురు వ్యక్తుల నుంచి 600 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని గంట్యాడ పోలీసులు అరెస్టు చేశారు. ఒక్కొక్కరి దగ్గర 200 గ్రాములు చొప్పున గంజాయి ఉన్నట్టు గుర్తించారు. రెండు మోటర్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేపాడ మండలం తుమ్మపల్లి లో సారా విక్రయిస్తున్న పాలిక అప్పలకొండను మంగళవారం అరెస్టు చేసి అతడి నుంచి ఐదు లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి తెలిపారు. తదుపరి చర్యలు నిమిత్తం కొత్తవలసలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. దాడుల్లో ఎస్ఐ రాజేశ్వరి, హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు నాయుడు, జనార్దన్ పాల్గొన్నారన్నారు.

52 మద్యం సీసాల స్వాధీనం

రాజాం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మంగళవారం బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి 52 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ జైభీమ్ తెలిపారు. రాజాం మండలంలో మల్ల మురళీ, గర్బాపు రాణిలను, వంగర మండలంలో గెంబలి శ్రీనివాసరావు, సంతకవిటి మండలంలో కాపుశెట్టి హేమశంకరరావులను అరెస్టు చేశామన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ మాణ్యాల్ ఉన్నారు.

భీమసింగి కార్మికులకు న్యాయం చేయండి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగారం ఉద్యోగులు, కార్మికులకు పీఎఫ్ గ్రాడ్యూటీ చెల్లించే విధంగా న్యాయం చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. మంగళవారం జేసీ సేతు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జేసీని కలిసిన వారిలో యూనియన్ ప్రతినిధులు సూర్యనారాయణ, ఆదిబాబు, వర్మ ఉన్నారు.

దన్నినపేటలో వైద్య పరీక్షలు

కొత్తవలస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నినపేటలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటైంది. మంగళవారం నిర్వహించారు. జేఎస్ఎల్ కర్మాగారం ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో వైద్యాధికారి టి.సుబ్బారావు వైద్య పరీక్షలను నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్మాగార డీజీఎం గోపాలకృష్ణ, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హత్య

(ఐదో పేజీ తరువాయి)

సంబరపడ్డారు. పెళ్లి చేద్దామని అనుకుంటుండగా అంతలోనే ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చింది. ప్రసాద్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు హృదయ విదారకంగా రోదిస్తుండడాన్ని చూసిన ప్రతి కన్నూ చెమర్చింది. విషయం తెలుసుకున్న బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, తెర్లాం, బాడంగి ఎస్‌ఐలు సాగర్‌బాబు, తారకేశ్వరరావు మంగళవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విజయనగరం నుంచి క్లూస్ టీము వచ్చి ఆధారాలను సేకరించింది. డాగ్‌స్క్వాడ్ ఘటనా స్థలం నుంచి కొంత దూరం వరకు వెళ్లి ఆగిపోయాయి. ● బాడంగి సీహెచ్‌సీకి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన వెళ్లి మృతుని తల్లిదండ్రులను ఓదార్చారు. పోస్టుమార్టం చేసిన వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీతో ఫోన్‌లో మాట్లా డారు. హత్యకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు మంగళవారం నెమలాం వెళ్లి ప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఐబీఎంలో ఉద్యోగం

కోనారి ప్రసాద్ ప్రాథమిక విద్య నుంచి టెన్త్ వరకు నెమలాం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. ఇడుపులపాయలోని వెల్లంపల్లి ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేసి 2021లో బెంగళూరు ఐబీఎంలో ఉద్యోగం సాధించాడు. తమ్ముడు అచ్యుతరావు కూడా బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు కాయకష్టం చేసుకుని పిల్లలను బాగా చదివించారు. వారు ప్రయోజకులయ్యారని, ఓ ఇంటి వారిని చేద్దామని ఎన్నెన్నో కలలు కంటున్నారు. పెద్ద కుమారుడు హత్యకు గురవడంతో వారి కలలన్నీ కల్లలుగా మారిపోయాయి.

నిందితులను పట్టుకుంటాం

ఘటనా స్థలాన్ని పరిశీలించి అన్ని ఆధారాలను సేకరించాం. మృతదేహంపై కత్తిగాట్లు కనిపిస్తున్నాయి. ఇది ముమ్మాటికీ హత్యగానే నిర్ధారించుకున్నాం. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను త్వరలో పట్టుకొని చట్టానికి అప్పగిస్తాం. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం. శవ పంచాయితీ అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాడంగి సీహెచ్‌సీకి తరలించాం. కేసు దర్యాప్తు చేస్తున్నాం.

- భవ్యారెడ్డి, బొబ్బిలి డీఎస్పీ

ప్రేమ వ్యవహారం ఏదైనా ఉందా?

కోనారి ప్రసాద్ హత్య వెనుక ప్రేమ వ్యవహారం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రిపుల్ ఐటీలో చదువుకున్నరోజుల్లో ఆ ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయితో ప్రసాద్‌కు పరిచయాలుండేవని, ఇప్పుడు వారి పరిచయాలు అలా కొనసాగుతున్నాయో లేదో తనకు తెలియదని ప్రసాద్ స్నేహితుడు తెలిపాడు. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

తలను రాయికి మోదడంతోనే..

బాడంగి సీహెచ్‌సీలో ప్రసాద్ మృతదేహానికి పోస్టుమార్టం ప్రక్రియ మంగళవారం పూర్తయింది. ప్రసాద్ తలను ఓ రాయికి గట్టిగా మోదించి హత్య చేసినట్లు అనుమానిస్తున్నామని వైద్యులు తెలిపారు. పంట భూముల్లోని సర్వే రాయికి తల బలంగా తాకడంతో ప్రసాద్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఆర్‌బీ రోడ్డుపైకి తెచ్చి పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. హత్యకు దారితీసిన కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

జగనన్న కాలనీల్లో అక్రమాలపై ఆరా

(ఐదో పేజీ తరువాయి)

నమోదు చేయనుంది. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, వీఆర్వోలతో కూడిన బృందం సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో నమోదు చేయనుంది. పట్టాలు పొందేందుకు తమకు అన్ని అర్హతలు ఉన్నాయని లబ్ధిదారులు నిరూపించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే మాత్రం అనర్హత వేటు వేసి ఇళ్ల పట్టాలను ప్రభుత్వం రద్దు చేయనుంది. అధికారులు, సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు లబ్ధిదారులు అన్ని ధ్రువీకరణపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. తెల్ల రేషన్‌కార్డు ఉండాలి. ఇళ్ల పట్టాలు పొందిన వారికి అంతకంటే ముందే పట్టా ఇచ్చి ఉంటే మాత్రం రద్దు అవుతుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తుంటే మరుక్షణం పట్టాను రద్దుచేస్తారు. కారు, నాలుగు చక్రాల వాహనం ఉంటే అనర్హులు. కుల ధ్రువీకరణపత్రం తప్పనిసరి. కుటుంబంలో ఒకరికంటే ఎక్కువ మందికి పట్టాలు ఉంటే.. ఒకరిది మాత్రమే ఉంచి మిగతా వాటిని రద్దుచేస్తారు. ఎవరైనా ఇప్పటికే ఆ ఇంటి స్థలాన్ని అమ్మినట్టు తేలితే వెంటనే వెనక్కి తీసుకుంటారు.

అడుగడుగునా అవకతవకలు..

విజయనగరం గుంకలాంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీ లేఅవుట్ రాష్ట్రంలో అతి పెద్దదైన వాటిలో రెండోది. ఇక్కడ 12 వేలకుపైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కానీ ఎక్కువగా అనర్హులకు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా నాటి వైసీపీ నేతల అనుచరులు, బంధువులు, కుటుంబ సభ్యులు బినామీలుగా పట్టాలు పొందారని తెలుస్తోంది. మరోవైపు విజయనగరంతో పాటు రాజాం, బొబ్బిలి పట్టణ ప్రాంతాలకు కేటాయించిన లేఅవుట్లలో పట్టాలు చేతులు మారినట్టు ఆరోపణలున్నాయి. ఇందులో కూడా అప్పటి వైసీపీ నేతలే సూత్రధారులని తెలుస్తోంది. ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో బినామీలు, అనర్హుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

ఇళ్ల కోసం సీపీఐ పోరుబాట

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ పోరుబాట చేపడుతోందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. మంగళవారం అమర్‌భవన్‌లో పోరుబాట వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు రంగరాజు, జగన్నాథం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించరూ..

● అధ్వానంగా ఎం.గదబవలస పాఠశాల పరిస్థితి
● పశువులు ప్రవేశిస్తున్న వైనం

మెరకముడిదాం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.గదబవలస గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోనికి పశువులు, ఇతర జంతువులు ప్రవేశిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది. ఈ పాఠశాలలో సుమారు 15మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు ప్రహరీ లేదు. ఈ పాఠశాలకు ఆనుకుని వ్యవసాయ భూములు ఉండటంతో అధికంగా పశువులు ఆవరణలోనికి ప్రవేశిస్తున్నాయి. దీనికి తోడు పాఠశాలకు ఆనుకుని ప్రధాన రహదారి ఉంది. దీంతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనులు గుర్తించారు

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ఎం.గదబవలస పాఠశాలను మలి విడతలో పనులు చేపట్టేందుకు గుర్తించారు. కానీ పనులు చేపట్టలేదు.

- ఎం.చంద్రశేఖర్, ఎంఈవో, మెరకముడిదాం



ఎం.గదబవలస పాఠశాలకు ప్రహరీ లేని దృశ్యం

1/70 చట్టాన్ని రద్దు చేసే ఆలోచన లేదు

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టాన్ని రద్దు చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదని, దీనిపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని కురుపాం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కొందరు 1/70 చట్టాన్ని రద్దు చేస్తామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పూర్తిస్థాయిలో అమలు చేసి షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనులకు న్యాయం చేశారన్నారు. పదో తరగతి చదివిన గిరిజన యువకులకు కూడా ఏకోపాధ్యాయులుగా గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు ఇచ్చిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. గిరిజనులకు ఉపయోగపడే జీవో నెం.3ని వైసీపీ ప్రభుత్వంలోనే రద్దు చేశారని ఆమె సందర్భంగా గుర్తు చేశారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

కురుపాం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల పరిరక్షణపై తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 1/70 చట్టాన్ని మార్చే ఉద్దేశం లేదని, గిరిజన భూములు గిరిజనులకు చెందాలనే సిద్ధాంతానికి తమ ప్రభుత్వ కట్టుబడి ఉందని అన్నారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

ఆదివాసీ చట్టాల అమలుకు ప్రభుత్వం కృషి

సాలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు సంబంధించిన 1/70 చట్టాన్ని మార్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన సాలూరులోని తన నివాసంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు.

అసత్య ఆరోపణలు తగదు

సాలూరు(పాచిపెంట), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందడుగు వేస్తుంటే, ఓర్వలేని తనంతో వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముఖి సూర్యనారాయణ తెలిపారు. పాచిపెంట మండలంలోని పి.కోనవలసలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మాజీ డిప్యూటీ సీఎం పి.రాజన్నదొర అన్ని తెలిసి కూడా చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గిరిజనులను తప్పుదోవ పట్టించే విధంగా 1/70 చట్టం కూటమి ప్రభుత్వం రద్దు చేస్తుందనడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడేపు యుగంధర్, కొత్తం పోలినాయుడు, చల్లా కనకబాబు, పూసర్ల నర్సింగరావు, పల్లేడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు



పుష్పాలంకరణలో పైడిమాంబ

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారికి వనం గుడి, చదురుగుడుల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని అనేక రకాల పువ్వులతో ఆలంకరించారు. వివిధ రకాల పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

ఉత్సాహంగా క్రీడలు

గరివిడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలలో రాష్ట్ర స్థాయి అంతర కళాశాలల క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. క్రీడల్లో 10 కళాశాలలకు చెందిన 240 మంది పాల్గొన్నారు. మంగళవారం బాలికలకు, బాలురలకు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు.

నేడు సీతగుండం యాత్ర

రామభద్రపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పాడివానివలస గ్రామ సమీపాన పర్వత శ్రేణుల మధ్య వెలసిన సీతారాముల ఆలయం వద్ద బుధవారం సీతగుండం యాత్ర నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిఏటా మాఘపౌర్ణమి నాడు ఇక్కడ సీతగుండం యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఈ మేరకు బుధవారం ఘనంగా సీతగుండం యాత్ర నిర్వహిస్తామని చెప్పారు.

పారిశుధ్య మెరుగుకు ఓడీఎఫ్ ప్లస్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రభుత్వం ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమాన్ని రూపొందించిందని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డిల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం బొబ్బిలిలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆయన స్వచ్ఛభారత్ సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సంపద కేంద్రం, ఇంటింటికి మరుగుదొడ్ల వినియోగం, ఘన, ద్రవ పదార్థాల నిర్వహణ తదితర స్వచ్ఛభారత్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్న గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ మేరకు గ్రామాల్లో మండల స్థాయి అధికారులు సర్వే చేపడతామని తెలిపారు. అవసరమైన చోట సామాజిక మరుగుదొడ్లకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఏఈ శ్రావణ్‌కుమార్, ఎంసీవో సుధాకర్, సమన్వయకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి దిగ్బంధంపై ఎమ్మెల్యే స్పందన

బెలగాం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ వీధికి ఆనుకొని ఉన్న రైల్వే స్థలంలో గల రహదారికి అడ్డంగా రైల్వే అధికారులు గోడ కట్టి మూసివేశారు. దీంతో గాంధీనగర్ వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే విజయచంద్ర మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రైల్వే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనికి ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ● అనంతరం పార్వతీపురం రైల్వే స్టేషన్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. 2వ, 3వ ప్లాట్‌ఫారంల మధ్య ఫుట్‌పాత్ బ్రిడ్జిల వెడల్పు తక్కువగా ఉందని, ప్రయాణికులు ఇబ్బంది పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులకు తెలిపారు. అలాగే గూడ్స్‌షెడ్ రోడ్డు కాలనీని పరిశీలించారు. అక్కడి స్థానికులు ఇంటింటి కొళాయిలు నిర్మించాలని ఎమ్మెల్యేని కోరారు. సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న గాంధీనగర్ వాసులు

టీడీపీలోకి 60 కుటుంబాలు

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం రాముడువలస గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన 60 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. బొబ్బిలి కోటలో మంగళవారం చింతాడ జయప్రదీప్, చింతాడ డేవిడ్ ఆధ్వర్యంలో వీరంతా ఎమ్మెల్యే బేబీనాయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా బేబీనాయన వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బేబీనాయన

ఆక్రమిత స్థలాలను రెగ్యులర్ చేస్తాం

● బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

రామభద్రపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను రెగ్యులర్ చేస్తామని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. సుమారు 150 గజాల స్థలాన్ని ఉచితంగా రెగ్యులర్ చేస్తామని, 150 దాటిన స్థలాలకు ప్రభుత్వానికి కొంత రుసుం చెల్లించి రెగ్యులర్ చేసుకోవాలని తెలిపారు. అలాగే ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 6వేల 903 ఫిర్యాదులకు గానూ సుమారు 6వేల 37 ఫిర్యాదులు పరిష్కరించామని చెప్పారు. మిగిలిన వాటిని కూడా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. గ్రామ సదస్సుల్లో వచ్చిన 11వేల 212 ఫిర్యాదుల్లో 10వేల 748 పరిష్కరించామన్నారు. అలాగే అర్హులైన వారందరికీ పట్టణాల్లో 2 సెంట్లు, పంచాయతీలో 3 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు

తెట్టంగిలో మహాలక్ష్మి తీర్థ మహోత్సవాలు

వీరఘట్టం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెట్టంగి గ్రామంలో మహాలక్ష్మి పేరంటాలు తీర్థ మహోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్త సజ్జల నారాయణరావు, జయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

న్యూస్ బాక్స్

డీఈసీ మాత్రలు మింగించాలి

బలిజిపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): డీఈసీ మాత్రలు ప్రజలకు మింగించడంలో ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలదే కీలక పాత్రని జిల్లా మలేరియా సహాయ అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని గంగాడ, నారంనాయుడువలస గ్రామాల్లో ఫైలేరియా మాత్రల సామూహిక పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సూపర్‌వైజర్ వెంకటరమణ ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులందరూ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో శంబంగి రమేష్ కోరారు. మంగళవారం ఆయన గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్.ఉమామహేశ్వరరావుతో కలిసి అలమండ పంచాయతీలోని నిడగళ్లగూడ, నీలకంఠాపురం గ్రామాల్లో పర్యటించారు. గృహ నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌మన్ 2023-24 ఇళ్ల నిర్మాణాలు మార్చి 31లోగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు.

వారంలోనే బీటీ రోడ్డు వేస్తాం

బొబ్బిలి/రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నుంచి దిబ్బగుడ్డివలస, ముక్కువ, శంబర వెళ్లే రోడ్డు పనుల్లో భాగంగా ఈ వారంలోనే రోడ్డుకు తారు వేస్తామని రోడ్లు భవనాల శాఖ బొబ్బిలి సర్కిల్ ఏఈ టీకే రాజు తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో కంకర వేశారు.. తారు మరిచారు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించా రు. ఈసందర్భంగా ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శంబర జాతర కారణంగా రోడ్డు పనుల్లో కొంత జాప్యం జరిగిందని, మిగిలిన పనిని త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

పాలకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో బెల్ట్ షాపులు నిర్వహించినా, అమ్మినా, సారా తరలించినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ ఫణీం ద్రబాబు పేర్కొన్నారు. సారా, మద్యం కేసుల్లో పలు దఫాలు దొరికిన పలువురికి మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహసీల్దార్ వద్ద లక్ష రూపాయల పూచీకత్తుతో బైండోవర్ చేశారు.

బంద్ జయప్రదం చేయండి

కురుపాం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బుధవారం నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం కురుపాంలోని వ్యాపారులకు కరపత్రాలు అందజేశారు. గిరిజన సంఘం నాయకుడు ఎం.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, కె.సీతారాం పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోను లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. సెస్ వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గ్రంథాలయానికి ప్రహరీ లేకపోవడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పనితీరును మెచ్చుకున్నారు. ఈ తనిఖీల్లో స్థానిక గ్రంథాలయ అధికారిణి సత్యవాణి పాల్గొన్నారు.

గర్భిణులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి తెర్లి జగన్మోహనరావు అన్నారు. గరుగుబిల్లి పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల సుఖ ప్రసవమే ధ్యేయంగా మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రసవాలు అధికంగా జరిగేలా దృష్టి సారించాలన్నారు. హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు క్రాంతి కిరణ్మయి, ఎస్.సంతోష్‌కుమార్, డీపీహెచ్‌ఎంవో కె.ఉషారాణి, డీసీఎం డి.విజయలత, ఎకడమిక్ ఈవో సత్తిబాబు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బలిజిపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది గర్భిణుల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు తెలిపారు. బలిజిపేట పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రక్తపరీక్ష ద్వారా హిమోగ్లోబిన్ శాతాన్ని తెలుసుకుని అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడిమిక్ ఎంపీహెచ్‌ఈవో సత్తిబాబు, డీపీహెచ్‌ఎస్ విజయలత, డీపీవో ఉషారాణి, వైద్యాధికారిణి క్రాంతికిరణ్మై, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట: గర్భిణులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు